క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

పద్మనాభం : మండలంలోని మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు చెప్పారు. ఐనాడలో రూ.49.20 లక్షలు, కోరాడలో రూ.1.18 కోట్లు, బి.ఆర్.తాళ్లవలసలో రూ.98.32 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 'నవ రత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా బి.ఆర్.తాళ్లవలసలో 1400 మందికి కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



తాళ్లవలసలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం తాళ్లవలసలో ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీతతోపాటు త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలు, శివరాత్రి ఆవశ్యకతను వివరించారు. జాగరణ ఉద్దేశ్యం తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కనకల త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.పైడన్న, కె.రాజు, కె.సంతోష్, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



రామలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ఏఎస్‌ఐ సీతాపతి తదితరులు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించిన బోర రామకృష్ణ అనారోగ్యంతో గత నెల 17న మృతి చెందారు. అతనితో కలిసి విధులు నిర్వహించిన సిబ్బంది ఆదివారం రూ.23,500 సాయం అతని భార్య రామలక్ష్మికి అందించారు. ఏఎస్‌ఐ సీతాపతి చేతుల మీదుగా ఈ సాయం అందించారు.

పద్మనాభంలో అగ్ని ప్రమాదం

పద్మనాభం : పద్మనాభం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో శిథిలావస్థకు చేరుకున్న రెండిళ్లు కాలిపోయాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక వ్యక్తి చెత్త కాల్చడంతో చెలరేగిన మంటలు సమీపంలోని శిథిలమైన ఇళ్లపైకి వ్యాపించడంతో కాలిపోయాయి. ప్రస్తుతం వీటిలో ఎవరూ నివసించడం లేదు. అగ్ని మాపక శకటం, స్థానికులు అప్రమత్తమై చుట్టు పక్కల ఇళ్లు, దుకాణాలపైకి మంటలు వెళ్లకుండా ఆర్పివేశారు. దీంతో భారీ నష్టం తప్పింది.

చిన్నారుల భవితకు రెండు చుక్కలు

నియోజకవర్గంలో పల్స్‌పోలియో విజయవంతం

తగరపువలస : భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తాళ్లవలస పీహెచ్‌సీ పరిధిలో గ్రామ సచివాలయాల ద్వారా 2,769 మంది చిన్నారులకుగాను 96.6 శాతం మందికి (2,676 మందికి) పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, వై.దుర్గా కల్యాణి, శోభారాణి, కల్యాణ చక్రవర్తి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, దివీస్ లేబొరేటరీ అధికారి కె.నరసింహ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివీస్ యాజమాన్యం 455 మంది సిబ్బందికి రూ.50 వేల విలువైన ఆహార ప్యాకెట్లు, తాగునీరు అందించారు. జీవీఎంసీ భీమిలి జోన్ తగరపువలస పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 బూత్‌లలో 56 మంది సిబ్బంది 2,598 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని అంబేడ్కర్ కూడలిలో జెడ్పీ కనకమహాలక్ష్మి ప్రారంభించారు. వైద్యురాలు సుష్మిత, సూపర్‌వైజర్ వై.హెచ్.వి.స్వామి పాల్గొన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు పోలియో చుక్కల కేంద్రాన్ని ప్రారంభించారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ జీవీ నారాయణ పోలియో చుక్కలు వేశారు.

పద్మనాభం : మండలంలోని 43 కేంద్రాల్లో ఆదివారం పల్స్ పోలియో విజయవంతంగా నిర్వహించారు. మద్ది గ్రామంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : భీమిలిలోని మూడో వార్డు పరిధిలో ఆదివారం పల్స్‌పోలియో విజయవంతమైంది. ఇక్కడ 1300 మంది పిల్లలను గుర్తించగా వారి కోసం 17 బూత్‌లు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ కళ్యాణ చక్రవర్తి ప్రారంభించారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతానికే 98 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

కొమ్మాది: జీవీఎంసీ 4, 5, 8వ వార్డుల పరిధిలోని ప్రాంతాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. చేపలుప్పాడలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, 8వ వార్డులో కార్పొరేటర్ లొడగల అప్పారావు ఆయా ప్రాంతాల్లో కార్యక్రమాలను ప్రారంభించారు.

మధురవాడ : జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో గల యూపీహెచ్‌సీలు, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విస్తృతంగా నిర్వహించారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, 5వ వార్డు కార్పొరేటర్ హేమలత, జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వైద్యులు దీపిక, సోల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు తెలిపారు. 46 బూత్‌లలో 4,362 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నది లక్ష్యం కాగా శత శాతం వేసినట్టు తెలిపారు. ఇటుక బట్టీలు, పొలాలు, కోళ్ల ఫారాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి అక్కడ గల చిన్నారులకు మొబైల్ టీమ్‌ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. వేములవలసలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, గంభీరంలో ఎంపీడీవో నమ్మి అప్పలనాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పీఎం పాలెం : స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుజాన్ పల్లా పర్యవేక్షణలో ఆదివారం పల్స్‌పోలియో విజయవంతంగా జరిగింది. ఆస్పత్రి పరిధిలో 2,200 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాదె రోశిరెడ్డి, బొట్ట అప్పలరాజు వైద్య



పట్టణ ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యురాలు దుర్గాకల్యాణి



అంబేడ్కర్ కూడలిలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ కనకమహాలక్ష్మి



ఉప్పాడలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు



బక్కన్నపాలెంలో పోలియో చుక్కలు వేస్తున్న అప్పలరాజు, వైద్య సిబ్బంది



వేములవలసలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రాంబాబు, వైద్య సిబ్బంది



మధురవాడ పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న పోతిన శ్రీనివాసరావు, తదితరులు



తాళ్లవలసలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ఏబీ మల్లికార్జునరావు



గంభీరంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీవో అప్పలనాయుడు, వైద్య సిబ్బంది



శింగనబందలో పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు



గాంధీబొమ్మ వీధిలో పోలియో చుక్కలు వేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు



పోలియో చుక్కలు వేస్తున్న గాదె రోశిరెడ్డి

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మధురవాడలో సిబ్బందితో ఆర్‌డీవో భాస్కరరెడ్డి

మధురవాడ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏర్పాట్లకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయాలని సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. ఇందులో భాగంగా భీమిలి ఆర్‌డీవో భాస్కరరెడ్డి ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీ, చంద్రంపాలెం 308, 248, మోడల్ పోలింగ్ స్టేషన్ 307, రుషికొండ యంగ్ ఓటర్స్ పోలింగ్ కేంద్రం 348ని పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ సునీల్

పద్మనాభం : రౌడీ షీటర్లు స్నేహ పూర్వకంగా మెలగాలని నార్త్ ఏసీపీ బి.సునీల్ సూచించారు. ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాలకు చెందిన 52 మంది రౌడీషీటర్లకు ఆదివారం పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపించినందున అల్లర్లు సృష్టించవద్దన్నారు. రౌడీషీటర్లు తమలో తాము ఘర్షణలు పడొద్దన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై పీడీ యాక్టు కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా అల్లర్లు జరిగితే పోలీసులకు స్థానికులు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుపై కూలిన తాటిచెట్టు



తాళ్లవలస వద్ద సర్వీస్ రోడ్డుపై కూలిన తాటిచెట్టు

తగరపువలస : తాళ్లవలస పంచాయతీ జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం తాటిచెట్టు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎవరికీ నష్టం జరగకపోయినప్పటికీ ఈ మార్గంలో సిటీబస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కేబుల్ వైర్లు తెగిపడి ప్రసారాలు, నెట్‌వర్క్‌లకు ఇబ్బంది కలిగింది. స్థానికులు చెట్టు తొలగించి రాకపోకలకు ఉపశమనం కలిగించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. • శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. • శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామవళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు



మధురవాడ ఎంఎస్‌ఆర్ లే అవుట్ పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ ఎంఎస్‌ఆర్ లే అవుట్‌లో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.1.92 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్కును ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.10 లక్షల విలువ చేసే స్థలం రిజిస్ట్రేషన్ చేసి మరీ లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. మధురవాడ పరిధిలోని జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో 15 వేలు మందికి, భీమిలి జోన్, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాలు కలుపుకుంటే మొత్తంగా నియోజకవర్గంలో 35 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే భాగ్యాన్ని జగన్ మోహన్ రెడ్డి తనకు కల్పించారన్నారు. ఎన్నికల అనంతరం సీఎం జగన్ మోహన్ రెడ్డి విశాఖ నుంచే పాలన సాగిస్తారని, తద్వారా ఇక్కడ ఆస్తుల విలువ మరింత పెరుగుతుందని, మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విశాఖ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో ఇంటికే పింఛన్, రేషన్ అందిస్తున్నారని, అవినీతి, పక్షపాతం లేకుండా అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. 'నాడు – నేడు' ద్వారా పాఠశాలలు, అభివృద్ధితో విద్యార్థులకు అనేక రకాల సదుపాయలు కల్పించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరిన్ని సేవలు అందించిన ఘనత ఆయనదే అన్నారు. మళ్లీ ఆయనే సీఎం అయ్యేలా అంతా దీవించాలన్నారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యమిచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ శైలజవల్లి, ఏఈ సురేష్, ఏపీడీ గంగాధర్, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, జేసీఎస్ కన్వీనర్లు డాక్టర్ గాదే రోశిరెడ్డి, కుడితి రామారావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యులు పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, మాజీ కార్పొరేటర్ సోంబాబు, సంజీవ్, వలరక్ష్మి పాల్గొన్నారు.



ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తెగిపడిన స్వామి వివేకానందుని విగ్రహం

తగరపువలస : స్థానిక తాతా థియేటర్ కూడలిలో ఆదివారం ఉదయం స్వామి వివేకానందుని విగ్రహం కాళ్ల వరకు తెగి కింద పడిపోయింది. ఇది ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కూలదోశారా..? లేదా ప్రమాదవశాత్తూ తెగి పడిపోయిందా..? అన్న విషయం తెలియడం లేదు. విగ్రహం దిమ్మె వద్ద కల్లు సీసా ఉండడంతో మద్యం మత్తులో ఎవరైనా కూల్చారా అన్న సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. విగ్రహం చుట్టూ విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కింద నుంచి చుట్టలుగా చుట్టుకుపోయి వున్నాయి. ఇవి తెగినప్పుడు విగ్రహానికి చుట్టుకుని కూలిపోయి ఉండొచ్చని మరికొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే భారీ వాహనాల ద్వారా ఐరన్ తదితర వస్తువులు మెయిన్ రోడ్డులోకి రవాణా చేసినప్పుడు అవి తగిలి ఉండవచ్చన్న సందేహం కూడా వ్యక్తమవుతోంది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా విగ్రహం కూలడానికి కారణాలు తెలుసుకోవాలని, దీని వెనుక దుశ్చర్య ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వివేకానందుని అభిమానులు కోరుతున్నారు.



కాళ్లు వరకు తెగిపోయిన స్వామి వివేకానందుని విగ్రహం



విగ్రహం వెనుక స్తంభానికి కేబుల్ వైర్లు

భర్త కిడ్నాప్‌పై ఫిర్యాదు

పీఎం పాలెం: తన భర్తను ఇద్దరు వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ పీఎం పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ప్రకారం... కొమ్మాది టీచర్స్ కాలనీలోని లక్ష్మి అపార్టుమెంట్‌లోని ఫ్లాట్ నంబరు 102లో ఇటికర్లపల్లి మహేష్‌కుమార్, భార్య సంతోష్ లక్ష్మి కుటుంబంతో నివసిస్తున్నారు. మహేష్ నగరంలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన నక్కా రామకృష్ణ, ఉమామహేష్‌తోపాటు మరో ఇద్దరు మహేష్‌కుమార్ నివసిస్తున్న అపార్టుమెంట్‌కు కారులో వచ్చారు. గతంలో ఉద్యోగం నిమిత్తం చక్రవర్తి, సుధాకర్ అనే వారికి డబ్బులు ఇచ్చామని... వాళ్లు మోసం చేశారని, ఆ వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్నందున ఆ సొమ్ము నీవే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బలవంతంగా మహేష్ కుమార్‌ను కారులో తీసుకుపోయారని బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం మహేష్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోందని, మధ్యవర్తిగా ఉన్నందున మొత్తం సొమ్ము చెల్లిస్తేనే తన భర్తను విడిచిపెడతామని బెదిరిస్తున్నారని సంతోషి లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

జగనన్న కాలనీ ఇల్లు ప్రారంభం


పద్మనాభం : ఏ ఒక్కరూ పూరి గుడిసెలో, అద్దె ఇళ్లలో నివసించకూడదన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో కరిమిరెడ్డి కాంత నిర్మించుకున్న జగనన్న కాలనీ ఇల్లును ఆదివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం వల్ల లబ్ధిదారులకు అద్దెల మోత తప్పిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లె బంగారునాయుడు, కరిమిరెడ్డి రవి పాల్గొన్నారు.



పెంట గ్రామంలో జగనన్న కాలనీ ఇల్లు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు, కోరాడ లక్ష్మణరావు

రూ.60 కోట్లతో సింహగిరి అభివృద్ధి

తగరపువలస : కేంద్ర ప్రభుత్వం 'ప్రసాదం' పథకం ద్వారా రూ.60 కోట్లతో సింహగిరి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన భీమిలిలో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో బౌద్ధుల ఆనవాళ్లు కలిగిన బావికొండ, తదితర ఆరామాలు ఇంకా అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. గతంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి భీమిలి అభివృద్ధికి హామీ ఇచ్చారన్నారు. ప్రధాని మోడీ అయోధ్య, వారణాసి తదితర పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారన్నారు. విశాఖ నుంచి వలసలు కట్టడిచేసేందుకు ప్రభుత్వం సాగునీటి అవకాశాలు పెంచాలన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని అయిదు నియోజకవర్గాల్లో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఉపకరణాలు అందించేందుకు ఉద్దేశించిన రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. వేలాది మంది పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. సోమవారం భీమిలిలో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఇటీవల రూ.2.50 కోట్ల విలువైన పరికరాలు వృద్ధులకు అందించామన్నారు. ఆయనతోపాటు భీమిలి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, ఉప్పాడ అప్పారావు ఉన్నారు.



భీమిలిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా నృత్యం చేసి అలరించారు. కళాకారులు సాన్వి, జ్యోతిర్మయి, యశస్విని, మోక్షిత, హాసిని, యశ్మిత, నవ్య, తదితరులు సీహెచ్ మోహన లక్ష్మి దర్శకత్వంలో నృత్యం చేశారు. కార్యక్రమాన్ని ఏవో విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు